క్లుప్తంగా

ఆర్థిక సాయం..

వేపాడ: మండలంలోని జాకేరులో కింతాడ సత్యారావుకు చెందిన రెండు గేదెలు విషాహారంతో కొద్ది రోజుల కిందట మృతి చెందిన విషయం తెలిసిందే. బాధితుడికి అండగా నిలవాలని సర్పంచ్ బుద్దాచిన్నమ్మలు, అప్పలనాయుడు పిలుపు మేరకు పలువురు దాతలు స్పందించారు. సర్పంచ్ దంపతులు రూ. పది వేలు ఇవ్వగా..క్వారీ మేస్త్రీలు, కార్మికులు, తదితరులు మరో రూ. 50 వేలు ఇచ్చారు. దీంతో ఆ మొత్తాన్ని బాధితుడు సత్యారావుకు సర్పంచ్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు టీవీ రమణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సారా బట్టీలపై నిరంతర నిఘా

కొత్తవలస: సారా బట్టీలు, బెల్ట్‌షాపులపై నిరంతర నిఘా ఉంచాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సహాయ కమిషనర్ పి.రామచంద్రరావు సూచించారు. మండలంలోని పలు మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖరనాయుడు, ఎస్సైలు వీఎస్ రాజు, రమ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ

వేపాడ: ప్రభుత్వ పాఠశాలలకు ఈస్ట్ ఇండియా పెట్రోలియం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా విజయనగరం జిల్లాలో ఆరు, విశాఖ జిల్లాలో రెండు పాఠశాలలకు ఎనిమిది కంప్యూటర్లను అందజేసిందని ఎన్‌కేఆర్ పురం పాఠశాల హెచ్ఎం ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. ఎంఈఓ బాలభాస్కరరావు సమక్షంలో గురువారం సాయంత్రం ఎనిమిది కంప్యూటర్లను తమ పాఠశాలకు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో రంజిత్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా నిల్వల పరిశీలన

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని దేవాడ, వెదుళ్లవలస రైతుసేవా కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి ఎస్.దామోదరరావు, తహసీల్దార్ సీహెచ్.బంగారుదొర, మండల వ్యవసాయాధికారి పి.ప్రసాదరావు గురువారం తనిఖీ చేశారు. దేవాడలో ఆరు మెట్రిక్ టన్నుల యూరియా, వెదుళ్లవలసలో 12 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. ఈ యూరియా నిల్వలు రైతులకు సరిపోవని గుర్తించారు.

ఆటో కార్మికుల భిక్షాటన

శృంగవరపుకోట/వేపాడ: ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు వాహనమిత్ర పథకం అమలు చేయకపోవడంతో తామంతా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్.కోటలోని బొడ్డవర జంక్షన్, వేపాడలోని బొద్దాం జంక్షన్ల వద్ద గురువారం ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్.కోటలో జరిగిన కార్యక్రమంలో జి.సన్యాసిరావు, బి.సత్తిబాబు ఐ.వెంకటరావు, ఎస్.చిన్న, కె.రాము, తదితరులు.. వేపాడలో పరదేశినాయుడు, శ్యామ్, త్రినాథ్, రామారావు, ఈశ్వరరావు, వెంకటరావు, అచ్యుతరావు దారప్ప, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ధరలకే విక్రయించాలి

గజపతినగరం: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలని విజిలెన్స్ సీఐ బి.సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల డిపోలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు నిల్వలను పరిశీలించారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులొచ్చినా చర్యలు తప్పవన్నారు. అనంతరం గంగచోళ్లపెంట రైతుసేవా కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి పి.కిరణ్‌కుమార్, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ ఎ.కామేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుల్ సీహెచ్ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దౌర్జన్యం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు వల్లంపూడి పోలీసులపై దౌర్జన్యం చేయడంపై వల్లంపూడి ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం వల్లంపూడి పోలీసు స్టేషన్‌కు చెందిన ఏఎస్సై నాగేశ్వరరావు, కానిస్టేబుల్ అప్పలనాయుడు వీలుపర్తి రోడ్డులో గస్తీ తిరుగుతుండగా వీలుపర్తి, రాయుడుపేట కూడలి జంక్షన్ వద్ద గల చెరువు గట్టుపై ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో స్థానికులను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో పోలీసులు వెళ్లి వారిని ప్రశ్నించగా.. మద్యం బాబులు వారిపై తిరగబడ్డారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో.. వారు వచ్చేసరికి మద్యం బాబులు పారిపోయారు. దీంతో ఏఎస్సై నాగేశ్వరరావు, కానిస్టేబుల్ అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు గురువారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

జీఓ 14 రద్దు చేయాలి

శృంగవరపుకోట: జిందాల్ భూముల సేకరణ కోసం ఇచ్చిన జీఓ 14ను రద్దు చేసి రైతుల భూములను తిరిగి వారికే అప్పగించాలని నిర్వాసితులు కోరారు. ఈమేరకు బొడ్డవర జంక్షన్‌లో గురువారం ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.


కొత్తవలస: తుమ్మికాపల్లి గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన మంటపంలో ఆదిశేష అవతారంలో వినియకుడు


జామి: మండల కేంద్రంలో పూజలందుకుంటున్న గణేషుడు


శృంగవరపుకోట: గాంధీ పార్కులో కొలువుదీరిన గజాననుడు


వేపాడ: మండల కేంద్రంలో కొలువైన గణనాథుడు


జామి: జీసీ కాలనీలో వినాయక మంటపం వద్ద దీపారాధన

గణేష్ మహరాజ్‌కీ జై..

నియోజకవర్గ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. బుధవారం ఉదయం మేళతాళాలతో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆదిదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ మంటపాల వద్ద చిన్నారులు, యువత నృత్యాలు చేస్తూ సందడి చేస్తుండడంతో సందడి వాతావరణం నెలకొంది. – సాక్షి నెట్‌వర్క్


కొత్తవలస: ఆకట్టుకుంటున్న ఉగ్రనరసింహుడి రూపంలో వినాయుకుడు


లక్కవరపుకోట: మండల కేంద్రంలోని జీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడు


చీపురుపల్లి : జి.అగ్రహారంలో కొలువుదీరిన విష్ణుమూర్తి అవతారంలో వినాయకుడు


చీపురుపల్లి మేజర్ పంచాయతీ జి.అగ్రహారంలో రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన వినాయకుడు


శృంగవరపుకోట: కాపువీధిలో కొలువుదీరిన ఎకో ఫ్రెండ్లీ మట్టి గణపతి


మెరకముడిదాం: కేదారీనాథ్ ఆలయం మాదిరిగా ఏర్పాటు చేసిన వినాయక మంటపం


గజపతినగరం: మేళ తాళాలతో గ్రామీణ ప్రాంతాలకు తరలిస్తున్న వినాయక విగ్రహాలు


గరివిడి: డీఎఫ్ఎన్ ఏరియాలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద యువత


గుర్ల: పాలవలస రామమందిరంలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు


గరివిడి: ఆకట్టుకుంటున్న వినాయకుని బొమ్మల కొలువు

యూరియా ఎప్పుడిస్తారు..?

- ఎ.డిని నిలదీసిన వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు 'బెల్లాన'

చీపురుపల్లి:

ఖరీఫ్ సీజన్‌లో యూరియా లేక రైతులు అల్లాడిపోతున్నారు.. యూరియా కోసం ఏం చేయాలో తెలియక, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అవస్థలు పడుతున్నారు.. చివరకు అత్యవసరంగా బ్లాక్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.. రైతులు ఇంత ఇబ్బందిపడుతున్నా వ్యవసాయ శాఖ ఏం చేస్తోందంటూ ఆ శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎ.డి) ఎస్.కోటేశ్వరరావును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ నిలదీశారు. గురువారం పట్టణంలోని ఆంజనేయపురంలో గల వ్యవసాయశాఖ ఎ.డి కార్యాలయానికి మేజర్ పంచాయతీలోని ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, రైతులతో వెళ్లి అక్కడున్న ఎ.డితో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు అందించాలన్న బాధ్యత పాలకులకు ఎలాగూ లేదు.. కనీసం అధికారులైనా ప్రణాళికలతో వ్యవహరించాలి కదా అని ప్రశ్నించారు. జగనన్న హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగానే అంచనాలు వేసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విత్తనాలు, ఎరువులు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎరువుల కోసం అన్నదాతలు రోడ్డెక్కాల్సిన దుస్థితి రావడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. దీనికి ఎ.డి కోటేశ్వరరావు స్పందిస్తూ రెండు రోజుల్లో యూరియా తెప్పించి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కొసిరెడ్డి రమణ, కరణం ఆది, మీసాల సీతారాం, బూరాడ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు తప్పని కష్టాలు..

వేపాడ: గత ఐదేళ్లు లేని యూరియా కష్టాలు ఇప్పుడు నెలకొనడంతో అన్నదాతలు ఏం చేయాలో తెలియక అవస్థలు పడుతున్నారు. మండలంలోని జాకేరు క్లస్టర్‌లో జాకేరు, గుడివాడ, కరకవలస, ఆకులసీతంపేట, మారిక రెవెన్యూ గ్రామాలున్నాయి. అయితే ఇటీవల జాకేరులో యూరియా పంపిణీ చేసినా అందరికీ అందించలేకపోయారు. ఆకుల సీతంపేట గ్రామానికి చెందిన అడపా ఈశ్వరరావు, కేదారి శ్రీను, హరీష్, తదితరులు మాట్లాడుతూ.. జాకేరు క్లస్టర్ పరిధిలో ఎవ్వరికీ యూరియా అందలేదన్నారు. ఈమేరకు పలువురు రైతులతో కలిసి వీఏఏను గురువారం ప్రశ్నించారు. ఈ విషయమై ఏఓ స్వాతిని వివరణ కోరగా.. జాకేరు క్లస్టర్‌లో ఐదు పంచాయతీలుండగా.. ఇప్పటి వరకు 512 బస్తాలు పంపిణీ చేశామని, మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు.

తోపులాటలు..

గజపతినగరం: మండలంలోని కెంగువలో గురువారం చేపట్టిన యూరియా పంపిణీ రసాభాసగా మారింది. యూరియా దొరుకుతుందో.. లేదోనని రైతులు ఎగబడడంతో వ్యవసాయ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఎరువులు సకాలంలో వచ్చి ఉంటే ఈ ఇబ్బంది వచ్చేది కాదు కదా అని పలువురు ప్రశ్నించారు.

యూరియా మాకొద్దు..

గుర్ల: రైతుకు ఒక యూరియా బస్తా ఇవ్వడంపై పెద్దబంటుపల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దబంటుపల్లి సచివాలయం పరిధిలో పెద్దబంటుపల్లి, రౌతు పేట, లవిడాం గ్రామాలున్నాయి. ఈ గ్రామాలలో సుమారుగా 700 మంది రైతులు ఉన్నారు. పెద్దబంటుపల్లి సచివాలయానికి వారం రోజుల కిందట 520 బస్తాల యూరియా లోడు వచ్చింది. ఒక రైతుకు ఒక బస్తా ఇచ్చినప్పటికీ ఇంకా రైతులు మిగిలిపోవడంతో పెద్దబంటుపల్లి సచివాలయం ముందు రైతులు గురువారం ఆందోళన చేశారు.


చీపురుపల్లి: ఎ.డి కోటేశ్వరరావును నిలదీస్తున్న నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పార్టీ నాయకులు


వేపాడ: జాకేరులో యూరియా కోసం వీఏఏను ప్రశ్నిస్తున్న రైతులు


గజపతినగరం: కెంగువ గ్రామంలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

మోతాదుకు మించరాదు..

- ఉద్యానవన శాస్త్రవేత్త రాధారాణి

మెరకముడిదాం: మామిడి తోటలకు మోతాదుకు మించి మందులు వాడరాదని ఉద్యానవన శాస్త్రవేత్త రాధారాణి సూచించారు. మండలంలోని ఊటపల్లి పంచాయతీ మధుర గ్రామం కొమ్మునివలసలో మామిడి తోటలను గురువారం సందర్శించి, రైతులకు పలు సూచనలు చేశారు. సస్యరక్షణ ఎలా చేయాలో.. ఏయే మందులు , ఏయే మోతాదులో వేయాలో వివరించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో చీపురుపల్లి క్లస్టర్ ఉద్యానవన శాఖాధికారి యు.అనూష మాట్లాడుతూ.. ఉద్యానవన రైతులకు ప్రభుత్వం రాయితీలతో కూడిన అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమా ఎందుకు రాలేదు: అధికారులను నిలదీసిన రైతులు

అవగాహన సదస్సుకు హాజరైన రాచగుమడాం, భీమవరం గ్రామాలకు చెందిన రైతులు కనకరాజు, శివాజీరాజు, తదితరులు మాట్లాడుతూ.. ఈ ఏడాది మామిడి పంటకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించామని.. అయితే పంట పూర్తిగా పోయినా బీమా రాలేదన్నారు. ఇన్సూరెన్స్ కట్టించడంలో ఉన్న శ్రద్ధ పరిహారం అందించడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. దీనికి అధికారులు స్పందిస్తూ నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించామని.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ సిబ్బంది గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కొమ్మునివలసలో మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఎస్పీ వకుల్ జిందల్

చీపురుపల్లి: నేరాల నియంత్రణకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులు పరిశీలించి, సీడీ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. అలాగే పోలీస్‌స్టేషన్ ఆవరణలో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణతో పాటు కేసుల మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని ఆదేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.రాఘవులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ లీలారావు, చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, ఎస్సై ఎల్.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి పోలీస్‌స్టేషన్‌లో..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్‌జిందల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామసందర్శనలు తరచూ చేపట్టి అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై లోకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సీఐటీయూ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000లో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా హైదారాబాద్‌లో పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన అమరవీరుల 25వ వర్థంతి సందర్భంగా గరివిడి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు మాట్లాడుతూ.. అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచగా.. వామపక్ష పార్టీల నిరసన చేపట్టగా పోలీసులు కాల్పులు జరిపారన్నారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ విద్యుత్ సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై భారం మోపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజావ్యతిరేఖ విధానాలపై పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గంట్యాడ అప్పలరాజు, ఉత్తరావల్లి ప్రకాష్, మూర్తి, జగదీష్, రామాంజనేయులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

జారిపడిన కొండ రాళ్లు

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక గ్రామానికి వెళ్లే రహదారిలో ఇటీవల కురిసిన వర్షాలకు కొండ చరియలు (బండరాళ్లు) విరిగి రోడ్డుపై పడ్డాయి. బుధవారం ఉదయం ఎవరూ లేని సమయంలో రాళ్లు పడడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.


మారిక రహదారిలో పడిన బండరాళ్లు

మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

- జెడ్పీటీసీ నరసింహమూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్

గంట్యాడ: మోసం చేయడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని బోనంగిలో గురువారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు వాటిని అమలు చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి. వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్